RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 354 పేజీలు - 05 వెల - 04/- శుక్రవారం 06 సెప్టెంబర్ 2024

# ఏపీవిపత్తు కు కేంద్రం సాయం చేస్తుంది.!

**విజయవాడ వచ్చిన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**

**వరద ప్రభావాన్ని పరిశీలించేందుకు ఏరియల్ సర్వే**

**కేంద్రం అండగా ఉంటుందని భరోసా**



ఆంధ్ర ప్రగతి విజయవాడ సెప్టెంబర్ 05: గతంలో ఎన్నడూ చవి చూడనంత జల ప్రళయాన్ని విజయవాడ చవి చూసిందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. గురువారం రోజు విజయవాడలోని జక్కంపూడి కాలనీ వరద ప్రభావిత ప్రాంతంలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పర్యటించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ....

వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితుల పట్ల ఏపీ ప్రభుత్వం స్పందించిన తీరు అభినందనీయమని కొనియాడారు. బాధితులకు సహాయ చర్యలు వేగంగా అందుతున్నాయని తెలిపారు. వరద బాధితులకు ఆహారం, నీరు, పాలు వేగంగా అందిస్తున్నారని చెప్పారు. ఇంకా సహాయ చర్యలు కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయానా వరద ప్రాంతాల్లో పర్యటించడం గొప్ప విషయమని ప్రశంసించారు. అందరం కలిసి బాధితులను గట్టెక్కించాలని అన్నారు.

# వైసీపీలో కల్లోలం..

**మాజీ ఎంపీ తో పాటు వైసీపీ నాయకుల అరెస్టు.!**



ఆంధ్ర ప్రగతి తాడేపల్లి సెప్టెంబర్ 05: ఏపీలో ఒకవైపు వరదలు మరోవైపు.. వర్షాలు ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇదే సమయంలో రాజకీయాలు కూడా అంతే వేగంగా మారుతున్నాయి. మంగళగిరిలోని టీడీపీ సెంట్రల్ ఆఫీసుపై దాడి ఘటనకు సంబంధించిన కేసు ఉరుకులు పరుగులు పెడుతోంది.ఈ కేసులో నిందితులుగా పేర్కొంటున్న వైసీపీ నాయకులను గత అర్ధరాత్రి నుంచి పోలీసులు అరెస్టు చేస్తున్నారు. ప్రస్తుతానికి ముగ్గురిని అరెస్టు చేసినట్టు తెలుస్తోంది. వీరిలో బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను గురువారం తెల్లవారు జామున మంగళగిరిలోని ఆయన నివాసంలోనే సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. అదేవిధంగా ఈ కేసుతో సంబంధం ఉందని భావిస్తున్న విజయవాడ నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అవుతు శైలజ భర్త.. ప్రముఖ కాంట్రాక్టర్ అవుతు శ్రీనివాసరెడ్డిని కూడా పోలీసులు అరెస్టు చేసినట్టు తెలుస్తోంది. ఈ ఇద్దరితో పాటు యువ నాయకుడు దేవినేని అవినాష్‌ను కూడా అరెస్టు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే.. ఆయన పోలీసుల కళ్లుగప్పి.. వేరే ప్రాంతానికి వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. ఇక, ఎమ్మెల్సీలు.. తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డిల అరెస్టుకు కూడా రంగం రెడీ అయినట్టు సమాచారం. వారిద్దరినీ అరెస్టు చేయాల్సి ఉందని.. అనుమతి ఇవ్వాలని.. మండలి చైర్మన్.. మోషేన్ రాజుకు పోలీసులు సమాచారం ఇచ్చారు. అయితే.. ఆయన అందుబాటులో లేకపోవడంతో అరెస్టు వాయిదా పడినట్టు తెలుస్తోంది. బుధవారం వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. అంతేకాదు.. సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు కూడా తగిన గడువు ఇవ్వకపోవడంతోపాటు.. కుట్రకోణం ఉందంటూ.. న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. దీంతో రాత్రికి రాత్రి.. టీడీపీ ఆఫీసు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఈ రోజు రేపట్లో మరింత మందిని అరెస్టు చేసే అవకాశం ఉంది. ఇదిలావుంటే, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న 12 మంది వైసీపీ కార్యకర్తలు.. ఇప్పటికే అరెస్టయి జైల్లో ఉన్న విషయం తెలిసిందే.

## సీఎం చంద్రబాబుకు తృటి లో తప్పిన ప్రమాదం.!



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 05: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ పెను ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. విజయవాడ వరదల్ని పరిశీలించేందుకు చంద్రబాబు రైల్వే ట్రాక్ ఎక్కారు. అదే సమయంలో వేగంగా రైలు వచ్చేవెంటనే కార్యకర్తలు అప్రమత్తంగా వ్యయహరించడంతో చంద్రబాబు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. దీంతో పార్టీ నేతలు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.**మిగతాది 2లో...**

## కుదిరితే వైసీపీ లేదంటే బిజెపి..

**వైయస్ షర్మిల సెటైర్లు.!**



**ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 05:** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల రాజకీయం బాగానే ఉంది అని సెటైర్లు పడుతున్నాయి. ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ఆమె తమలపాకుతో కొట్టినట్లుగా రెండు ముక్కలు మాత్రమే విమర్శలు చేస్తారు.ఆ మీదట గత ప్రభుత్వం అంటూ వైసీపీ ప్రభుత్వాన్ని మాత్రం బాగానే తూర్పారా పడతారు.భారీ వరదలు వచ్చింది ప్రస్తుతం. దీనికి కారణాలు ఏమిటో అందరికీ తెలుసు. ఆక్రమణల వల్లనే బుడమేరు పొంగి నివాసాల్లోకి వచ్చింది. ఆ పాపంలో ఉమ్మడి ఏపీని పాలించిన నాటి కాంగ్రెస్ నుంచి టీడీపీ వైసీపీ అందరి పాత్ర ఉంది. అంతే కాదు భారీగా వరదలు వస్తాయని ఊహించక పోవడం కూడా ఎంతో కొంత ప్రభుత్వ వైఫల్యం కిందకే వస్తుందని అంటున్నారు.అయితే షర్మిల మాత్రం టీడీపీ కూటమిని వదిలేసి జగన్ ప్రభుత్వం మీద విమర్శలు చేయడాన్ని వైసీపీ నేతలు తప్పు పడుతున్నారు. గత ప్రభుత్వం అయిదేళ్లలో నీటి ప్రాజెక్టులకు కనీసం ఇయర్లీ మెయింటెనెన్స్ కి కూడా నిధులు ఇవ్వలేదు అని షర్మిల విమర్శించారు. దాని ఫలితంగా నదులలో గేట్లు తేలియాడటం అంతా చూసారు అని ఆమె అన్నమయ్య ప్రాజెక్టు గేట్ విరిగిపడిన ఉదంతాన్ని గుర్తు చేశారు**మిగతాది 2లో...**

## సత్య వేడు ఎమ్మెల్యేను సస్పెండ్ చేసిన టిడిపి అధిష్ఠానం.!



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 05: లైంగిక వేధింపుల వివాదంలో ఇరుక్కున్న సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసహైదరాబాద్లో మీడియా సమావేశం పెట్టిన ఓ మహిళ.. సత్యవేడు ఎమ్మెల్యేతో ఏకాంతంగా ఉన్న దృశ్యాలు బయట పెట్టారు. తనను వేధించి లోబర్చుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే తీరును తీవ్రంగా పరిగణించిన హైకమాండ్.. సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంంది.**మిగతాది 2లో...**

## వైసిపి బురద రాజకీయం..

**వరదల్లో కూటమి విజయం సాధిస్తుందా.!**

ఆంధ్ర ప్రగతి విజయవాడ సెప్టెంబర్ 05: విజయవాడలో అనూహ్యంగా వచ్చిపడ్డ వరదలు, అధికారంలో వున్న కూటమి పార్టీలకు సంకటంగా మారాయా.?ముఖ్యమంత్రి చంద్రబాబు, కంటికి నిద్ర లేకుండా.. బాధిత ప్రజల మధ్యే వుంటూ, సహాయ కార్యక్రమాల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నా, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, అధికారులతో క్షణం తీరిక లేకుండా పర్యవేక్షిస్తున్నా..ఇవేవీ కూటమి ప్రభుత్వం పట్ల బాధిత ప్రజల్లో సానుకూలత కనిపించడంలేదా.? 'వైసీపీ సృష్టిస్తున్న ఫేక్ ప్రచారమే' విజయవాడ వరదల్లో విజయం సాధిస్తోందా.?**మిగతాది 2లో...**



## ఒక వ్యక్తి దుర్మార్గానికి నగరం గడగడలాడింది..!

**-ముఖ్యమంత్రి చంద్రబాబు**

**-అమరావతి మునిగిందని దుష్ప్రచారం చేసే వాళ్లని అందులో పూడ్చాలి.. అప్పుడే బుద్ధొస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు**

2లో

## చంద్రబాబుపై జనసేనాని ప్రశంసలు..

3లో

**సీఎం చంద్రబాబును మెచ్చుకుంటూ పవన్ స్పెషల్ ట్వీట్!**

**ఏపీలో వరద బాధితులకు డ్రోన్ల ద్వారా ఆహారం అందజేత**

# కుదిరితే వైసీపీ లేదంటే బిజెపి..

*(మొదటి పేజి తరువాయి)*

ఆ మీదట ఆమె కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మీద పడ్డారు. ఏపీలోని పార్టీల మద్దతుతో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఏపీకి ఏమి సాయం చేస్తోంది అని నిలదీశారు. ఏపీని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఇక ఏపీలో ప్రకాశం బ్యాజేజి ఢీ కొన్న పడవల ప్రమాదం మీద విచారణ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. దీని వెనక ఏ శక్తులు ఉన్నాయో వెలికి తీయాలని అన్నారు. వారిని కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు. చరిత్ర కలిగిన ప్రకాశం బ్యారేజ్ కే ఈ రకమైన పరిస్థితి వస్తే ఎలా అని ఆమె అన్నారు.

మరి పడవలు ప్రకాశం బ్యారేజిని ఢీ కొట్టడం వెనక కుట్ర కోణం ఉందని టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పటికే చెబుతోంది. ఇపుడు షర్మిల కూడా దాని మీదనే డిమాండ్ చేస్తున్నారు. మరి ఇండైరెక్ట్ గా ఆమె చేసిన ఈ కామెంట్స్ కూడా ఎవరి మీద అన్న చర్చ వస్తోంది.

మొత్తం మీద చూస్తే షర్మిల వైసీపీనే టార్గెట్ చేశారు అని అంటున్నారు. అంతే కాదు కేంద్రంలో బీజేపీ ఎటూ కాంగ్రెస్ కి శత్రువే కాబట్టి ఆ ప్రభుత్వం మీద విమర్శలు చేయడం ఓకే. కానీ ఏపీలో టీడీపీ కూటమిలో కూడా బీజేపీ ఉందని ఆమెకు తెలియదా అని అంటున్నారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం మీద కంటే కూడా వైసీపీ మీదనే ఆమె చేస్తున్న పోరాటం రాజకీయ విమర్శలు అన్నీ కూడా చర్చకు కారణం అవుతున్నాయి.

# సీఎం చంద్రబాబుకు త్రుటి లో తప్పిన ప్రమాదం.!

*(మొదటి పేజి తరువాయి)*

విజయవాడ వరద ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యల్ని పరిశీలించేందుకు సీఎం చంద్రబాబు గత కొన్ని రోజులుగా వరుస పర్యటనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇవాళ బుడమేరు వాగు ప్రవాహం పరిస్థితి చూసేందుకు నగరంలోని మధురానగర్ కు వెళ్లారు. అక్కడే ఉన్న రైల్వే ట్రాక్ పైకి ఎక్కి బుడమేరు ప్రవాహాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్నారు. చంద్రబాబుతో పాటు ఆయన భద్రతా కూడా ఉన్నారు. అదే సమయంలో సడన్ గా ఓ రైలు ట్రాక్ పైకి దూసుకొచ్చింది. చంద్రబాబు రైల్వే ట్రాక్ పై ఉన్న సమయంలో ట్రైన్ రావడంతో వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది..ఆయన్ను అలర్ట్ చేశారు. వెంటనే స్పందించిన టీడీపీ కార్యకర్తలు లైన్‌మెన్‌ను తీసుకువచ్చారు. ఆయన ఎర్రజెండా ఊపడంతో ట్రైన్ అక్కడే నిలిచిపోయింది. చంద్రబాబుకు కేవలం 3 అడుగుల దూరంలో రైలు నిలిచిపోయింది. దీంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియక కాసేపు గందరగోళం నెలకొంది. ఆ తర్వాత చంద్రబాబు సేఫ్ గా ఉన్నారని తెలిసి అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత మిగిలిన ప్రాంతాలను పరిశీలించేందుకు చంద్రబాబు బయలుదేరి వెళ్లిపోయారు.

# వైసిపి బురద రాజకీయం...

*(మొదటి పేజి తరువాయి)*

ప్రశ్నలైతే చాలా వున్నాయ్.! నిజమే, వైసీపీ చాలా చాలా ఫేక్ ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. గుట్టలుగా శవాలంటూ అత్యంత హేయమైన ప్రచారానికి దిగింది వైసీపీ. సోషల్ మీడియా వేదికగా వైసీపీ శ్రేణులు చేస్తున్న దుష్ప్రచారం అంతా ఇంతా కాదు.

ఒక్క మాట నిజం.. వరదలంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఆస్తి నష్టం అంచనాలకు మించి వుంటుంది. అయితే, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు కొంతమేర అవకాశం వుంటుందన్నది నిర్వివాదాంశం. కానీ, ఆకస్మిక వరదల నేపథ్యంలో, ఏ ప్రభుత్వానికైనా 'నష్టాన్ని తగ్గించేందుకు ప్రయత్నించడం' తప్ప వేరే ఆప్షన్ వుండదు. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యల్ని ప్రభుత్వం చేపడుతున్నా, సోషల్ మీడియా వేదికగా వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం, బాధితుల్లో భయాందోళనలు కలిగిస్తోంది. బుడమేరు గేట్లు ఎత్తేసి, కావాలనే ప్రజల్ని ముంచేశారంటూ సాక్షాత్తూ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించడం అత్యంత హేయం. ఏ ప్రభుత్వమైనా తమ ప్రజల్ని చంపేయాలనుకుంటుందా.? ఇదెక్కడి విడ్డూరం.? వరదల్లో బురద రాజకీయాలు కొత్తేమీ కాదు. కాకపోతే, దానికీ ఓ హద్దూ అదుపూ వుండాలి. కొన్ని రోజులు ఆగి, తప్పొప్పుల పంచాయితీ చేస్తే దాన్నెవరూ కాదనరు. సహాయక చర్యల్లో ప్రభుత్వంతో కలిసి విపక్షాలూ పని చేయాల్సి వుంటుంది. ఆ బాధ్యతను వైసీపీ విస్మరించింది. సరే, వైసీపీ నుంచి బాధ్యతగల రాజకీయాల్ని ఆశించలేం. కానీ, కూటమి ప్రభుత్వం ఏం చేయాలి.? యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ముమ్మరం చేయడమొక్కటే సరిపోదు. ఫేక్ ప్రచారంపైనా ఫోకస్ పెట్టాలి. ఎప్పటికప్పుడు ప్రజలకు సరైన సమాచారం చేరవేయగలగాలి. అక్కడే కూటమి పార్టీలు కొంత విఫలమయ్యాయేమో అనిపిస్తుంది. టీడీపీకి సోషల్ మీడియా వింగ్ చాలా స్ట్రాంగ్‌గా వుంది. జనసేన పార్టీ విషయంలోనూ అంతే. బీజేపీ కూడా అంతే.! కానీ, ఈ మూడు పార్టీల సోషల్ మీడియా వింగ్స్, జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టడంలో విఫలమవుతున్నాయి. ప్రభుత్వ విభాగాలన్నీ ప్రస్తుతం వరద సహాయక చర్యల్లో నిమగ్నమైన దరిమిలా, ప్రభుత్వం తరపున అధికారికంగా విపక్షాల దుష్ప్రచారాన్ని ఖండించడం సాధ్యమయ్యే పని కాదు. క్రైసిస్ మేనేజ్‌మెంట్‌లో దిట్ట.. అని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఫేక్ ప్రచారం.. విషయంలోనూ క్రైసిస్ మేనేజ్‌మెంట్ తప్పనిసరి.. అని గుర్తెరిగితే మంచిది. వైసీపీ ఫేక్ ప్రచారం ఏ స్థాయికి వెళ్ళిందంటే, ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్.. ఐదేళ్ళ పాటు గతంలో ముఖ్యమంత్రిగా పని చేసినా, బుడమేరు అనే వాగుని.. నదిగా పేర్కొంటుండడం. ఆ వాగు నుంచి వచ్చే వేల క్యూ సెక్కుల నీటితో, లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో వుండే కృష్ణా నదికి అదనపు వరద వస్తుందనే దుష్ప్రచారం వైసీపీ చేయగలగుతోందంటే.. ఇంతకన్నా దుష్ప్రచారం ఇంకేముంటుంది.?

# ఏపీవిపత్తు కు కేంద్రం సాయం చేస్తుంది.!

*(మొదటి పేజి తరువాయి)*

తాను వరద ప్రాంతాలను పరిశీలించానని శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. పరిస్థితులు అదుపులోకి రావడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారని శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. కృష్ణా నది, బుడమేరు పొంగిందని చెప్పారు. సీఎం చంద్రబాబు కలెక్టరేట్?నే సెక్రటేరీయేట్ చేసుకున్నారని వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో చంద్రబాబు అండ్ టీం 24 గంటలు పని చేసి బాధితులకు అండగా నిలిచారని అన్నారు. కేంద్రప్రభుత్వం ఏపీకి పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఇంతటి జలప్రళయం సంభవించినా మృతులు సంఖ్యని తగ్గించగలిగారని శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు.

ఐఏఎస్ అధికారులకు పూర్తి స్థాయిలో బాధ్యతలు అప్పగించారని తెలిపారు. డ్రోన్ల ద్వారా ఫుడ్ ప్యాకెట్లు అందించడం దేశంలోనే తొలిసారి అని వివరించారు. వరద సాయంపై బాధితులు సంతృప్తితో ఉన్నారని అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని వివరించారు. ప్రకాశం బ్యారేజ్? 70 ఏళ్ల పురాతనమైందని తెలిపారు. మరింత వరద వచ్చినా...15 లక్షలు క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా ప్రకాశం బ్యారేజీని పటిష్టపరుస్తామని శివరాజ్ సింగ్ చౌహాన్ మాటిచ్చారు.

ప్రకాశం బ్యారేజీ పటిష్టతపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చర్చిస్తామని తెలిపారు. ప్రకాశం



బ్యారేజీ పటిష్టతపై నిపుణులతో చర్చిస్తామని చెప్పారు. బుడమేరు సమీపంలో అక్రమ మైనింగ్ జరగడం వల్ల కూడా ఇబ్బందులు వస్తున్నాయని తెలిసిందని అన్నారు. ఏపీలో పెద్ద ఎత్తున పంటలు నష్టపోయాయని శివరాజ్ సింగ్ చౌహాన్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బృందాలు వరద నష్టంపై అంచనాలు వేస్తాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఫసల్ బీమా యోజనా పథకాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుంటుందని తెలిపారు. వరద నష్టం అంచనాపై క్లారిటీ రాగానే కేంద్ర ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు.

అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ... వాతావరణ మార్పుల వల్ల రెండు రోజుల్లో 40 సెంటి మీటర్లు వర్షపాతం ఈ ప్రాంతంలో పడిందని అన్నారు. బుడమేరు వద్ద పెద్ద ఎత్తున పైనుంచి నీరు వచ్చిందని తెలిపారు. 7 వేల నుంచి 10 వేల క్యుసెక్కుల కెపాసిటీ ఉన్న ప్రాంతంలో.. 36 వేల క్యుసెక్కులకు పైగా వరద వచ్చిందని వివరించారు. ప్రకాశం బ్యారేజ్?ను మరింత పటిష్టం చేయడంతో పాటు బండ్?లు మరింత పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంట్లోని ప్రతి వస్తువు పాడై పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు మిలటరీ వచ్చి బ్రీచ్?లను క్లోజ్ చేసే పనిలో సాయం చేస్తారని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**2019లో బుడమేరు అభివృద్ధి పనులను వైసీపీ రద్దు చేసింది: సీఎం చంద్రబాబు**

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఏరియల్ సర్వే చేపట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బుడమేరు గండ్లు పడిన ప్రాంతాన్ని కేంద్ర మంత్రి చూశారని అన్నారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతమంతా వర్షాలు పడ్డాయని చెప్పారు బుడమేరు పొంగడంతో పలు కాలనీలు జలమయం అయ్యాయని అన్నారు. బుడమేరు వాగు ఆధునికీకరణ కోసం పనులు ప్రారంభిస్తే.. 2019లో వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. 15 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చినా తట్టుకునేలా ప్రకాశం బ్యారేజీని మరింత పటిష్టపరచాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా నదీ కరకట్టలను మరింత బలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. బుడమేరు గండ్లను పూడ్చేందుకు ఆర్మీ రంగంలోకి దిగుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# సత్య వేడు ఎమ్మెల్యేను సస్పెండ్ చేసిన టిడిపి అధిష్టానం.!

*(మొదటి పేజి తరువాయి)*

ఆరోపణలు వచ్చిన వెంటనే సస్పెండ్ చేసిన టీడీపీ

లైంగిక వేదింపులు చేసిన మహిళ కూడా టీడీపీకి చెందిన కార్యకర్తనేని చెబుతున్నారు. సొంత పార్టీ చెందిన మహిళా కార్యకర్తల్ని లైంగికంగా వేధించడాన్ని తెలుగుదేశంపార్టీ హైకమాండ్ సీరియస్ గా తీసుకుంది. ముందు పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని విషయం తెలిసిన వెంటనే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబున్నాయుడు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. వివరణ అయినా .. సస్పెండ్ చేసిన తర్వాతనే తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు వెంటనే పల్లా శ్రీనివాసరావు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కోనేటి ఆదిమూలం

లైంగిక వేధింపుల ఆరోపణలను కోనేటి ఆదిమూలం ఖండిస్తున్నారు. మహిళ హైదరాబాద్లో ప్రెస్ మీట్ పెట్టిన వెంటనే.. కొన్ని మీడియా సంస్థలల్ను ఆయనను సంప్రదించాయి. తెలుగుదేశం పార్టీ నేతలే తనపై కుట్ర చేశారని ఆయన ఆరోపించారు. నిజానికి ఆయన తెలుగుదేశం పార్టీ తరుపనే గెలిచినా.. గత ఎన్నికల ముందు వరకూ వైసీపీలో ఉన్నారు. టిక్కెట్ రాకపోవడంతో టీడీపీలో చేరారు. టీడీపీ ఆయనకు టిక్కెట్ ఇచ్చింది. మూడు వేల ఓట్ల స్వల్ప తేడాతో ఆయన రెండో సారి విజయం సాధించారు. అంతకు ముందు రెండు సార్లు వైసీపీ తరపున పోటీ చేశారు. 2019లో వైసీపీ తరపున గెలిచారు.

టీడీపీ నేతలే కుట్ర చేశారని ఆదిమూలం ఆరోపణ

ఆయన టీడీపీలో చేరడం.. సత్యవేడు స్థానిక టీడీపీ నేతలకు ఇష్టం లేకపోయింది. ఆయనకు వ్యతిరేకంగా పని చేశారన్న ప్రచారం ఉంది. ఇప్పుడు వాళ్లే తనపై కుట్ర చేశారని అంటున్నారు. అంటే టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరాటంతోనే ఈ వివాదం బయటకు వచ్చిందని తెలుస్తోంది. పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లుగా తెలియడంతో కోనేటి ఆదిమూలం ఆజ్ఞాతంలోకి వెళ్లారు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు.ద

**ప్రైవేటు వీడియోలు విడుదల చేసిన మహిళ**

హైదరాబాద్లో మీడియాతో మాట్లాడిన మహిళ.. కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించి లొంగ దీసుకున్నారని ఆరోపించారు. పెన్ కెమెరా పెట్టుకుని రికార్డు చేశానని చెప్పారు. కొన్ని ప్రైవేటు వీడియోలు కూడా రిలీజ్ చేశారు. అందలో కోనేటి ఆదిమూలం శృంగారం దృశ్యాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ వ్యవహారంలో అసలేం జరిగిందో మొత్తం బయటకు రావాల్సి ఉంది.

# వరద బారినపడ్డ ప్రతి కుటుంబానికీ నిత్యావసర సరకులు అందిస్తాం.!

ఆంధ్ర ప్రగతి విజయవాడ సెప్టెంబర్ 05: విజయవాడలో ముంపులో ఉన్న ఇళ్లకు వెళ్ళి నిత్యావసర సరకులు అందించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వరద ప్రభావంతో అతలాకుతలమైన ప్రతి కుటుంబానికీ నిత్యావసరాలను అందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంటుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి వరద ప్రభావిత ప్రాంతాల్లో నిత్యావసర సరుకుల కిట్లను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ట్రయల్ రన్ ను గురువారం సాయంత్రం విజయవాడలో నిర్వహించారు. శ్రీ మనోహర్ తోపాటు పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొని పంపిణీ విధానాన్ని పరిశీలించారు. సింగ్ నగర్ ప్రాంతంలోని రామకృష్ణాపురంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోహర్ ముంపు బాధితుల ఇళ్లకు వెళ్ళి వారిని పరామర్శించి నిత్యావసరాలతో కూడిన కిట్లు



అందించారు. వరదల వల్ల ప్రభావితం అయిన ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ పంచదార, కేజీ కందిపప్పు, ఒక లీటరు వంటనూనె, రెండు కేజీల ఉల్లిపాయలు, రెండు కేజీల బంగాళ దుంపలు పౌర సరఫరాల శాఖ ఇస్తుంది.

ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "గతంలో ఎన్నడూ లేనివిధంగా వచ్చిన ప్రకృతి విపత్తు వల్ల రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు, లక్షలాది ప్రజలు ప్రభావితం అయ్యారు. విజయవాడ ప్రాంతంలో చాలా నష్టం జరిగింది. ఇప్పుడిప్పుడే వరద బాధల నుంచి కోలుకుంటున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా నిలవాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంతో వరద బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా నిలిచేలా నిత్యావసర వస్తువులు అందించాలని నిర్ణయించాం. ఒక కిట్ రూపంలో అందించనున్నాం. రాష్ట్రంలో వరద ప్రభావితం అయిన ప్రతి కుటుంబానికి ఇవి అందుతాయి. మొదటగా విజయవాడ నుంచి ఈ పంపిణీ ప్రారంభించనున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం మేరకు ప్రతి ఇంటికీ వెళ్లి ఈ కిట్ ను ప్రభుత్వ సిబ్బంది వరద బాధితులకు అందిస్తారు. ఎక్కడా ఎలాంటి లోపం లేకుండా ఈ పంపిణీ జరిగేలా శాఖలు సమన్వయంతో పని చేయాలి. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల సహాయం కూడా తీసుకుని ప్రతి ఇంటికీ వెళ్లి బాధితులకు ఈ సహాయం అందించి ప్రభుత్వం అండగా ఉందనే భరోసాను వారికి ఇవ్వాలన్నదే మా సంకల్పం"


# ఒక వ్యక్తి దుర్మార్గానికి నగరం గడగడలాడింది..!

విజయవాడ ఆంధ్ర ప్రగతి సెప్టెంబర్ 5: ఒక వ్యక్తి దుర్మార్గానికి నగరం గడగడలాడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. ఇలాంటి దుర్మార్గులను కఠినంగా శిక్షిస్తే తప్ప ప్రజలకు మంచి జరగదని ఆయన పేర్కొన్నారు. ఎగువన కురిసిన వర్షాల వల్ల బుడమేరులో వరద ప్రవాహం దాదాపు 8 వేల క్యూసెక్కులు పెరగవచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మళ్లీ బుడమేరు పొంగితే ఏం చేయాలనే ఆందోళనలో తాము ఉంటే, రాక్షసులు మాదిరి జగన్ వ్యవహారం ఉందని దుయ్యబట్టారు.

విజయవాడ నగరం వైపు పడిన 3 గండ్లలో ఒక గండిని పూడ్చామని, మరో 2 గండ్లు పూడ్చాల్సి ఉందని పేర్కొన్నారు. బుడమేరులో ఎగువ ప్రాంతంలో పెరుగుతున్న వరద ప్రవాహం వల్ల ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేసే యంత్రాంగం ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. కృష్ణా నదికి మరో 40 వేల క్యూసెక్కుల నీరు వచ్చుంటే మరింత ప్రమాదం సంభవించేదని అన్నారు.

భవానీపురంలో వచ్చిన వరద అన్ని ప్రాంతాలనూ ముంచెత్తిందని అన్నారు. బుడమేరు ప్రవాహాన్ని మళ్లించేందుకు తీసుకున్న చర్యలేవీ అమలు కాలేదన్నారు. బుడమేరు సమీపంలో 2019 నుంచి ఆక్రమణలు పెరిగాయన్న సీఎం బుడమేరు కాల్వ, వాగును గతంలో ఆక్రమించారని తెలిపారు. గత ఐదేళ్లల్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఏం గాడిదలు కాసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుడమేరు ఆక్రమణలపై సర్వే చేయమన్నామని తెలిపారు. పోలవరం రైట్ మెయిన్ కెనాల్ గట్లను కూడా తవ్వేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ చేసిన తప్పునకు అమాయకులు ఇబ్బంది పడ్డారని చంద్రబాబు ఆరోపించారు.

అమరావతి మునిగిందని దుష్ప్రచారం చేసే వాళ్లని అందులో పూడ్చాలి అప్పుడే బుద్ధొస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. ఒక్క వ్యక్తి అహంభావం వల్ల పెద్ద ఎత్తున ప్రజలు ఇబ్బంది పడాలా, ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే తప్పుడు ప్రచారం చేస్తారా అంటూ మండిపడ్డారు. అమరావతి మునిగిందా ? వీళ్లను పూడ్చాలి. అప్పుడే బుద్ధి వస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి రాజకీయ నేరస్తులను తప్పుడు ప్రచారం చేసే వారిని సంఘ బహిష్కరణ చేయాలని అన్నారు. వైఎస్సార్సీపీ లాంటి పార్టీకి రాష్ట్రంలో ఉండే అర్హత లేదని అన్నారు. సాయం చేయకపోగా నిందలేసి తప్పుడు ప్రచారం చేపడతారా? అని సీఎం విమర్శించారు. ప్రజల కోసం తాను యజ్ఞం చేస్తుంటే వైఎస్సార్సీపీ నేతలు రాక్షసుల్లా అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలకు సేవ చేయాలి, మరోవైపు రాక్షసులతో యుద్ధం చేయాల్సి వస్తోందని అన్నారు. బురద జల్లడం ఆపాలని, సిగ్గుంటే క్షమాపణ కోరాలని చంద్రబాబు అన్నారు.



తప్పుడు ప్రచారం చేసేవాళ్లని సహించనని హెచ్చరించారు. తన ఇంటిలోకి నీళ్లొస్తే.. వస్తాయి, వెళ్తాయి అని చంద్రబాబు అన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షాతో ఫోన్లో మాట్లాడానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఏపీలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని కోరానని తెలిపారు. విజయవాడలో, రాజధానిలోనూ ముంపు బారిన పడకుండా కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. బోట్లల్లో తరలింపు కోసం డబ్బులు తీసుకుంటే కేసులు పెడతామని సీఎం హెచ్చరించారు. ప్రైవేట్ బోట్ల వాళ్లూ డబ్బులు వసూలు చేయకూడదని తెలిపారు. తరలింపు కోసం డబ్బులు తీసుకుంటే అరెస్ట్ చేస్తామన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచకుండా ఉండేలా ప్రణాళిక రూపొందించామన్నారు. నిత్యావసరాలు, కూరగాయల ధరలకు ప్రభుత్వమే ఫిక్స్?డ్ ధర నిర్ణయిస్తుందని తెలిపారు. సాయంత్రం లేదా రేపట్నుంచి నిత్యావసర వస్తవుల పంపిణీ చేపట్టనున్నామని తెలిపారు. వివిధ ఉద్యోగ సంఘాలు ఒక్క రోజు జీతం విరాళం ఇవ్వడానికి ముందుకొచ్చారని చంద్రబాబు వెల్లడించారు.

# ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

**-రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించండి. -ఆసుపత్రికి అవసరమైన పరికరాలను ఏర్పాటు చేస్తాం.**
**-ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఎన్ఎండి ఫరూక్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 05: ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు సమకూరుస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. గురువారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, జిజిహెచ్ సూపరింటెండెంట్ వరప్రసాద్, వైద్యశాలలోని వివిధ విభాగాల అధిపతులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు అవసరమైన పరికరాల ఏర్పాటుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులనుండి వినియోగించుకోవాలని సూచించారు. గత రెండు సంవత్సరాల నుండి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరగలేదని ఇప్పటినుండి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి అవసరమైన పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అంశాలపై చర్చించి అవసరమైన నిధులు సమకూర్చుకొని అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. గతంలో పెండింగ్ ఉన్న ఎలక్ట్రికల్, ప్లంబరింగ్, స్టేషనరీ, సిసి కెమెరాల ఏర్పాటు తదితర బిల్లులకు సంబంధించిన నిధులను ఆమోదించామన్నారు. ఆసుపత్రికి అవసరమైన తాగునీటి సౌకర్యాన్ని అమృత స్కీం కింద ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ చర్చిస్తామని తెలిపారు. అగ్ని ప్రమాదాలకు సంబంధించిన పరికరాలు, స్వచ్ఛ సుగం శానిటేషన్ కింద టాయిలెట్లు ఏర్పాటుకు అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. రెడ్ క్రాస్



సొసైటీ ఆధ్వర్యంలో జన ఔషధ కేంద్ర ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ సర్వజన వైద్యశాలలో ఉన్న వసతులను మరింత పటిష్టం చేసుకుని వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఆస్పత్రిలో నీటి కొరత లేకుండా మున్సిపల్ అధికారుల సమన్వయంతో ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలను ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటి ఏర్పాటు చేసుకొని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. హాస్పిటల్ కు అన్ని విధాల సపోర్టు ఇచ్చి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ప్రతిరోజు 1000 నుండి 1200 మంది నిరుపేదలు వైద్యం కోసం వస్తుంటారని వారందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు.

పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ సేవలకు సంబంధించిన అవసరమైన అత్యవసర పరికరాలను ఎంపీ నిధుల నుండి ఏర్పాటు చేస్తామన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి అన్ని విధాలా సహకరించి వైద్య వృత్తికి అన్ని విధాల న్యాయం చేసి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యాధికారులను కోరారు. గతంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు వైద్యం కరువైందని ఆసుపత్రికి అవసరమైన సిటీ స్కాన్, ఎంఆర్ఐ, బెడ్ స్కాన్ కు మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. మురుగునీటి నిలువ, పిచ్చి మొక్కలు, పందులు, దోమలకు ఆవాసంగా అపరిశుభ్రతకు నిలయంగా జిల్లా స్థాయి ఆసుపత్రి ఉండడం బాధాకరమని మంచి వాతావరణం ఆసుపత్రి ఆవరణంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ జఫ్రుల, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# వామ్మో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రా అనే భయం పేద రోగుల్లో పోగొట్టాలి

**-గత వైసీపీ పాలనలో పేదలకు వైద్యం దూరం చేశారు.**
**-ఎంపీ నిధులతో ఆసుపత్రి లో మౌళిక వసతులు కల్పిస్తా.**
**-కొందరు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై అసహనం వ్యక్తం చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05: వామ్మో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రా, అక్కడికి వెళ్ళితే సస్తాం అనే పేదరోగుల్లోని భయాన్ని డాక్టర్లు తొలగించాలని, కొందరు ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం, నిర్వాహకం వల్ల వైద్యులందరికి చెడ్డపేరు వస్తోందని, వారి పద్ధతి మార్చుకొని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులందరికి మంచి వైద్యం అందించాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

గురువారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర న్యాయశాఖ, మైనారటి వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్. ఎం. డి ఫరూక్, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్న ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆసుపత్రిలో కొందరు వైద్యుల నిర్లక్ష్యం, నిర్వాహకంపై ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు.

వైద్యులు దేవుడుతో సమానమని, ఎక్కువ మంది నిరుపేదలే వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికే వస్తారని, వారికీ మెరుగైన వైద్యం అందకపోతే ఎలా అని ఆమె ప్రశ్నించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వైద్యం అందించిన తర్వాత మందులు కూడా ఉచితంగా అందించాలని ఆదేశాలు ఉన్నా కొందరు డాక్టర్లు సిటీ స్కాన్, మందులు బయటకు రాయడమేంటని ఎంపీ శబరి నిలధీశారు. గత వైసీపీ పాలనలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు వైద్యం కరువైందని, ఆ నాటి సీఎం జగన్మోహన్ రెడ్డి నంద్యాలకు వచ్చినప్పుడు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి సిటీ స్కాన్, ఎం ఆర్ ఐ, బెడ్ స్కాన్ లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చి గాలికి వదిలేచాడని ఎంపీ శబరి విమర్శించారు. గత వైసీపీ ప్రజా ప్రతినిధులు ఆసుపత్రిలో తమ వారికీ ఆదాయం వచ్చే పనులు చేసి పేదరోగులకు మంచి వైద్యం అందించలేకపోయారని విమర్శించారు.

సులబ్ కాంప్లెక్స్ మధ్యలో ఆగిపోవడం వల్ల రోగులు, వారి బంధువులు ఆసుపత్రికి వచ్చి ఎన్నో కష్టాలు పడుతున్నారని వాటి నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని కోరారు.

మురుగునీటి నిల్వ, పిచ్చి మొక్కలు, పందులు, దోమలకు ఆవాసంగా, అపరిశుభ్రతకు నిలయంగా నంద్యాల జిల్లా స్థాయి ఆసుపత్రి ఉండడం బాధేస్తోందని, వెంటనే సమస్య పరిస్కారం చేయాలని, మంచి వాతావరణం ఆసుపత్రి ఆవరణలో ఉండేలా చర్యలు తీసుకోవాలి, తక్షణమే తాగునీటి వసతి, శాశ్వత నీటి వసతి ప్రభుత్వ ఆసుపత్రికి కల్పించేందుకు మంత్రి %చీవీణ% ఫరూక్, జిల్లా కలెక్టర్ ద్వారా చేస్తామని ఎంపీ శబరి చెప్పారు.

టీడీపీ పాలన, మంత్రి ఎన్ ఎండి ఫరూక్ ప్రత్యేక కృషి వల్ల నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి 30 పడకల నుంచి 300 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ అయిందని, ప్రస్తుతం 500 పడకల ఆసుపత్రిగా మంత్రి ఫరూక్ నాయకత్వంలో అప్ గ్రేడ్ కావడం సంతోషంగా ఉందన్నారు. ఆసుపత్రి అప్ గ్రేడ్ అయినట్లుగానే వసతులు కూడా పెరగాలని, కొన్ని విభాగాలకు వైద్యులు కూడా కొత్తగా రావాల్చి ఉందన్నారు. తన ఎంపీ నిధులు కూడా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించి రోగులకు మౌళిక వసతులు కల్పిస్తామని ఎంపీ శబరి హామీ ఇచ్చారు.

# బహుజన విద్యార్థి సంఘం లోగోను ఆవిష్కరించిన గౌరు వెంకటరెడ్డి.




ఆంధ్ర ప్రగతి కర్నూలు సెప్టెంబర్ 05: బహుజన విద్యార్థి సంఘం లోగోను నందికొట్కూరు టిడిపి ఇన్చార్జ్ గౌరవ వెంకట్ రెడ్డి మరియు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం కృషి చేయాలని, పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని వారు అన్నారు అనంతరం బహుజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలుట్ల రమణ మాట్లాడుతూ గత 12 సంవత్సరాల నుండి విద్యార్థుల మరియు ప్రజా సమస్యలపై నిరంతరము కృషి చేయడం జరిగింది కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు గౌతం, నాయక్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితుల సహాయార్థం 20వేల రూపాయల ఆర్థిక సహాయం.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ సెప్టెంబర్ 05:** ఆళ్లగడ్డ తాలూకా సిరివెళ్ల మండలం సిరివెళ్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు మాజీ జెడ్పిటిసి. యామ గురప్ప మరియు సిరివెళ్ల టిడిపి కార్యకర్తలు కలిసి విజయవాడలోని వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ గారి ఆధ్వర్యంలో 20వేల రూపాయలు విరాళంగా అందజేయడం జరిగింది. విరాళాన్ని అందజేసిన వారిని భూమా అఖిలప్రియ అభినందించడం జరిగింది ఇంకా ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి వరద బాధితులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సల్ల గోపాల్ బ్రహ్మయ్య కటకం శేఖర్ రవి మరెందరో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# వార్షిక రుణ ప్రణాళిక కింద 12,828 కోట్లు.

**-పంట రుణాలకు సంబంధించి 5,366 కోట్ల రుణాల లక్ష్యం.**
**-రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 05: జిల్లాలో జిల్లాలో 2024 25 వార్షిక రుణాల ప్రణాళిక కింద వివిధ బ్యాంకుల ద్వారా 12,828 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన బ్యాంకర్ల సమన్వయ సమావేశం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ పి నరసింహారావు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగప్రవీణ్, డిసిసి బ్యాంక్ సీఈవో విజయ్ కుమార్, ఎల్ డి ఎం రవీంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.




ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళిక కింద 12,828 కోట్లు కేటాయించామని ఇందుకు సంబంధించి బ్యాంకులవారీగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని బ్యాంకర్లను సూచించారు. ప్రధానంగా వ్యవసాయ రంగానికి 5,366 కోట్లు, టర్మ్ లోన్లకు 2,503 కోట్లు, చిన్న, మధ్యతర పరిశ్రమలకు 1400 కోట్లు, గృహ నిర్మాణాలకు 567 కోట్లు, ప్రాధాన్యత రంగాలకు 394 కోట్లు ఇతర ప్రాధాన్యతర రంగాలకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించేందుకు బ్యాంకర్లు సహకరించాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. అలాగే టిడ్కో కింద లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించామని మరింత చేయూతనిచ్చి రుణాల మంజూరుకు సహకరించాలని బ్యాంకర్లను సూచించారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద నిర్దేశించిన రుణాలను మంజూరు చేయాలని కోరారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతులకు రుణాల కింద 130 కోట్లు మంజూరు చేశారని దాదాపు 30 వేల మంది కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. ఆర్వో ఎఫ్ఆర్ కింద సాగు చేసుకుంటున్న రైతులకు కూడా రుణాలు మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారులను బ్యాంకుల చుట్టూ తిప్పుకొని వారి సహనాన్ని పరీక్షించకుండా అవసరమైన రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను సూచించారు. మన జిల్లాలో అధిక వనరులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో నంద్యాల జిల్లా 20వ స్థానంలో ఉందని ఉన్న వనరులను సమర్ధవంతంగా వినియోగించుకొని ప్రతి ఏడాది 15% వృద్ధిరేటుతో ముందుకు వెళ్లాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ జిల్లా స్థాయిలోని వనరులను ప్రమోట్ చేస్తూ నిరుపేదల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో జనాభాకు తగ్గట్టు బ్యాంకులు, ఏటీఎంలు లేవని వాటిని పెంచేందుకు బ్యాంకర్లు ప్రతిపాదనలు పంపాలన్నారు. విద్యా విషయక అడ్వాన్సులు తక్కువ మొత్తంలో ఇస్తున్నారని విదేశాలకు వెళ్లి చదువుకునేందుకు విద్యా రుణాలు అధిక సంఖ్యలో ప్రమోట్ చేయాలని బ్యాంకరులను కోరారు.

పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ ముద్ర లోన్ ల విషయమే తెలియదని బ్యాంకర్లు చెప్తున్నారని ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన ముద్ర లోన్లను నిరుపేదలందరికీ ఇవ్వాలన్నారు. నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు రుణాలు రిషెడ్యూల్ చేస్తూ కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, పరిశ్రమల జిఎం శ్రీనివాస యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి వైవి మురళీకృష్ణ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుపై జనసేనాని ప్రశంసలు..

విజయవాడ : సెప్టెంబర్ 5 ఆంధ్ర ప్రగతి : భారీ వరదలు తెలుగు రాష్ట్రాలను వణికించిన విషయం తెలిసిందే. దీంతో వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సహాయ చర్యలు ముమ్మరం చేశాయి. ముఖ్యంగా ఏపీలో సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించడం, నేరుగా వరద బాధితుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. బాధితులు పస్తులు ఉండకుండా డ్రోన్లను ఉపయోగించి ఆహారాన్ని అందించారు. ఇలా డ్రోన్ సహాయంతో వరద బాధితులకు ఆహారాన్ని అందించిన ఫొటోలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుపై జనసేనాని ప్రశంసలు కురిపించారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేసేందుకు వినూత్న మార్గాలను అన్వేషించే చంద్రబాబును తప్పకుండా అభినందించాలని ట్వీట్ చేశారు. "డ్రోన్ల ద్వారా వరద బాధితుల బాధలను ఎలా తగ్గించవచ్చో ఈ ఫొటోలను చూస్తుంటే మనకు అర్థమవుతోంది. ఆపదలో ఉన్నవారికి సహాయం చేసేందుకు వినూత్న మార్గాలను అన్వేషించే ముఖ్యమంత్రి చంద్రబాబును మనం తప్పకుండా అభినందించాలి. మీ నుంచి చాలా నేర్చుకోవాలి సర్. ఏపీలో మీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అందరికీ స్ఫూర్తినిస్తుంది" అని పవన్ తన ట్వీట్లో రాసుకొచ్చారు.

# చైతన్య ఎం యు పి స్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.



ఆంధ్ర ప్రగతి రుద్రవరం సెప్టెంబర్ 05: మండల కేంద్రం రుద్రవరంలోని చైతన్య ఎం యు పి స్కూల్ లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాడాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ జబ్బర్ హెడ్మాస్టర్ మేడా ప్రసాద్ , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కరస్పాండెంట్ జబ్బర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి క్రమశిక్షణతో మంచి నడవడికతో మంచి విద్యాబుద్ధులు పొంది ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకోవాలని కొనియాడారు. హెడ్మాస్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ యొక్క జీవిత చరిత్రను విద్యాభ్యాసాన్ని వివరించి మన రాష్ట్ర తొలి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి అయినటువంటి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శప్రాయుడు మరియు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ వృత్తికి మంచి గౌరవం రావడానికి తాను ఎంతో కృషి చేశాడని కొనియాడారు. కనుక ఈరోజు భారతదేశమంతా ఈ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరికీ చాలా సంతోషకర విషయమని అలాగే ఉపాధ్యాయులకు ధన్యవాదములు తెలియజేసే అవకాశం ఈరోజున విద్యార్థులకు రావడం మరియు విద్యార్థులు తమ ఉపాధ్యాయులను గుర్తు చేసుకోవడానికి ఇది ఒక మంచి దినముగా భావించి, తమ యొక్క భవిష్యత్తుకి మంచి పునాదులు వేసేటువంటి ఉపాధ్యాయులకు ఈరోజు చాలా ముఖ్యమైన రోజుగా భావించాలని కొనియాడారు. చివరగా విద్యార్థులందరూ పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పాఠశాల యాజమాన్యం తమ పాఠశాలలో పనిచేసేటువంటి ఉపాధ్యాయులకు బహుమతులు ప్రధానం చేసి, తగిన సలహాలు ఇవ్వడమైనది.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి.




ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05: ఎస్ఎఫ్ఐ నాలుగో ప్లీనరీ సమావేశం నంద్యాల పట్టణంలో టి.నరసింహయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ ప్లీనరీ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.నాగరాజు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ విద్య బలోపేత కోసం ప్రతి ఒక్కరూ కృషి ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, సంక్షేమ హాస్టల్లో పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వ హాస్టల్లో సీట్లు రాకపోవడంతో ప్రైవేట్ హాస్టల్లో లక్ష రూపాయలు ఫీజులు కట్టి విద్యను అభ్యసించలేక తల్లిదండ్రులు కలిసి దూరప్రాంతాలకు వలసలకు వెళ్తున్న వాటిన ఆపడానికి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు వేలాదిమంది విద్యార్థులు భవిష్యత్తు నాశనం అవుతున్న ప్రజా ప్రతినిధులు కూడా విద్యార్థుల గురించి ఆలోచించడం లేదని అన్నారు. ఎస్ఎఫ్ఐగా గల్లి నుండి ఢిల్లీ వరకు ప్రభుత్వ విద్యను కాపాడాలని పోరాటాలు చేస్తుంటే దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మాత్రం నూతన జాతీయ విద్యా విధానం నీప్ 2020 ద్వారా కేంద్రీకరణ కార్పొరేట్ కారణ మతోన్మాద విధానాలు తీసుకొచ్చి భారత రాజ్యాంగం మౌలిక స్వరూపాలు అయినా లౌకిక ప్రజాస్వామ్యం స్వామివాద ఫెడరల్ స్ఫూర్తి గల లక్షణాలను దెబ్బతీస్తూ రాష్ట్ర హక్కులను కాలరాస్తుందన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామ్యంలో పోనీ చేస్తున్న సంఘటనలు నేడు సెంట్రల్ యూనివర్సిటీలలో చూడవచ్చు అన్నారు. అలాగే భవిష్యత్తులో జిల్లాలో ప్రభుత్వ విద్య బలోపేతం చేయడానికి ప్రతి ఒక విద్యార్థి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎం ఆర్ నాయక్, అశోక్, రాజా, హరివర్ధన్, జిల్లా అధ్యక్షులు మధుశేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ వాహనాలకు కొత్త టెక్నాలజి

### -జిల్లా ఎస్పి శ్రీ అధిరాజ్ సింగ్ రాణా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05: నంద్యాల జిల్లా ఏస్పీ ఆధ్వర్యంలో పోలీసు వాహనాలకి టెక్నాలజీ తో కూడిన జీపీస్ లను అమర్చడం జరిగింది. 7 హైవే మొబైల్ వాహనాలకు కి, 22 బ్లూ కాల్ట్ వాహనాలకి జీపీస్ లను అమర్చడం జరిగింది.

దీని ద్వారా పోలీస్ సిబ్బంది ఏ ఏరియాలో తిరుగుతున్నారు, మునుపటి రోజులలో ఏ ఏ ఏరియాలో తిరిగారో కచ్చితంగా తెలుసు కోవచ్చు, అలాగే ఏదైనా సంఘటన జరిగితే ఆ స్తలానికి ఎవరు దగ్గర లో ఉన్నారో ఈ జీపీస్ ద్వారా తెలుసుకొని వారిని ఆ సంఘటన స్తలానికి త్వరగా పంపవచ్చు. పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతున్నారా, లేక ఒకేచోట విశ్రాంతి తీసుకుంటున్నారా తెలుసుకొని వారిని అలెర్ట్ చేయుటకు ఈ జీపీస్ ఉపయోగపడుతుంది..

పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుటలో నిర్లక్ష్యం వహిస్తున్నారా, జాగ్రత్త గా తిరుగుతున్నారా, ఏ ఏరియా లో ఉన్నారు, ఎంత వేగం తో వెళ్తున్నారు, సంఘటనా స్తలానికి ఇంకా ఎంత సేపటికి వెళ్లొచ్చు అని తెలుసుకోవచ్చు. నంద్యాల జిల్లా ఎస్పీ రాష్టం లోనే మొదటి సారిగా బ్లూ కాల్ట్ వాహనాలకు జీపీస్ అమర్చి నేరాలను నియంత్రణ చేయడం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

అలాగే హై వే మొబైల్ వాహనాల డ్రైవర్స్ కి, బ్లూ కాల్ట్ వాహనాల డ్రైవర్స్ తో ప్రత్యేకంగా సమావేశం జరిపి నేరాల నియంత్రణ లో ముఖ్య పాత్ర పోసించిన వారికి రివార్డ్, అలసత్వం వహించిన వారికి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాము అని చెప్పడం జరిగింది.

# సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో లో పౌష్టికాహార మాసోత్సవాలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05:**



నంద్యాల పట్టణ పరిధిలో మెప్మా మునిసిపాలిటి స్థాయి లో పౌష్టికాహార మాసోత్సవాల పై మెప్మా అర్ పి లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం అయినది. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథి గా రాష్ట్ర మహిళా రక్షణ కమిటీ సభ్యులు, శ్రీమతి రుకియా బేగం , స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి నిర్మల , మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, సీడీపీఓ అర్బన్ చంద్రకళ హాజరు కావడం అయినది. ఈ కార్యక్రమం గురించి శ్రీమతి నిర్మల, ప్రాజెక్టు డైరెక్టర్, స్త్రీ సంక్షేమ శాఖ వారు మాట్లాడుతూ తక్కువ ధరలలో ఎక్కువ పోషక విలువలు ఉండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు, పాలు, సాంప్రదాయ ఆహార పదార్థాల వలన వచ్చే పోషక విలువలపై అవగాహన కల్పించడం అయినది. తల్లిపాల ఆవశ్యకత, జంక్ ఫుడ్ ల వలన ఉత్పన్నమయ్యే అనారోగ్యాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురుంచి వివరించడం అయినది. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిది గా హాజరు అయిన శ్రీమతి రుకియా బేగం రాష్ట్ర మహిళా రక్షణ కమిటీ సభ్యులు వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టం పై అవగాహన, వాటి వలన కలిగే నష్టాలు గురుంచి వివరించారు. అదే విధంగా సమాజం లో మహిళల పై జరిగే అఘాయిత్యాలు గురుంచి వివరించారు. ఎక్కడ ఇటువంటివి జరిగిన ధైర్యంగా కమిటీ దృష్టికి తీసుకొని రావాలని మహిళలుకు పిలుపునిచ్చారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి వారు మాట్లాడుతూ ఈ నెలలో జరిగే అన్ని సంఘాలు, సమాఖ్య లు మరియు పట్టణ సమాఖ్య ల మీటింగ్ లో అజెండా గా పౌష్టికాహారం, బాల్య వివాహాలు, మహిళల పై జరిగే అఘాయిత్యాలు గురించి చర్చించి ప్రతి ఒక్క సభ్యురాలికి అవగాహన కల్పించాలని తెలియ చేయడం అయినది. ఈ కార్యక్రమం లో మెప్మా సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్వైజర్ లు, పట్టణ పరిధి లోని అర్ పీ లు అందరూ పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు అండ ఏఐటీయూసీ జెండా

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05:**



ఆటో యూనియన్ జెండాను ఆవిష్కరించిన ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కె ప్రసాద్ .ఈ సమావేశానికి అధ్యక్షత వ హించిన ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు హాజరైన రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు భూమని శ్రీనివాసులు అనంతరం నాయకులు మాట్లాడుతూ బొమ్మల సత్రం లో ఆటో కార్మికులు నూతన ఆటో యూనియన్ జండా ఆవిష్కరించడం సంతోషకరణమని అన్నారు ఆటో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ఆటో కార్మికులకు అండగా నిలిచేది ఏకైక మొనగాడి సంఘం ఏఐటీయూసీ అని అన్నారు ఆటో కార్మికులు ఆటోకు సంబంధించిన అన్ని ఫోర్సు ఉంచుకొని యూనిఫారం ధరించి ఆటోలో ఎక్కిన ప్యాసింజర్ల తో మర్యాదగా నడుచుకుంటూ తమ తమ గమ్యస్థానాలకు చేర్చాలని అన్నారు అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వము ఆటో కార్మికులకు ఒక సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు ఆటో కార్మికులు అనేకమంది ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారని అటువంటి వారికి ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు ఆటో కార్మికులు పెద్దపెద్ద చదువులు చదివి ఉద్యోగాలు రాక స్వయం ఉపాధితో ఆటోలు ఫైనాన్స్ లలో తీసుకొని అటు ఫైనాన్స్ వాళ్ళ బాధలతో ఇటు సరైన ఆటో బాడిగలు లేక ఇంటి అద్దె బాడిగలు కట్టుకోలేక అనేక బాధలు పడుతూ కుటుంబాలను లాక్కొని వస్తూ ఉంటారు వారికి సరైన గుర్తింపు రాష్ట్ర ప్రభుత్వం కల్పించి వారిని ఆదుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు సుబ్బరాయుడు బాలస్వామి అంతోని గుర్రప్ప మబ్బుల్ సురేష్ జయన్న మునిస్వామి షబ్బీర్ మధు హరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత తో ఇబ్బందులు పడుతున్న రైతులు..

# పట్టించుకోని అధికారులు.!

- -బ్లాక్ మార్కెట్లో 300 రూపాయలు యూరియా బస్తాదర పలుకుతున్న వైనం.
- -బయట షాపులపై నామమాత్రపు తనిఖీలు.
- -ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయాలు.
- -చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న వ్యవసాయ అధికారులు.

**ఆంధ్ర ప్రగతి**
**బండి ఆత్మకూరు సెప్టెంబర్ 05:**




బండి ఆత్మకూరు మండలంలో దాదాపు పదివేల హెక్టార్లలో ఒరిస్సాగు చేశారు అన్నదాతలు. ఒక ఎకరాకు మూడు బస్తాలు చొప్పున వేసిన దాదాపు 80 వేల నుండి లక్ష బస్తాల ఏరియా అవసరం. బండి ఆత్మకూరు మండలానికి వచ్చింది అంతంత మాత్రమే. కానీ బయట ఎరువుల దుకాణంలో మాత్రం పుష్కలంగా యూరియా దొరుకుతుంది. అయితే యూరియా కావాలంటే అమోనియా బస్తాలు తీసుకోవాల్సిందన్న నిబంధనలను బయటి షాపులలో నిబంధనలు. చేసేదేమీ లేక ఏరియా కోసం రైతులు ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలోని దాదాపు 15 రైతు భరోసా కేంద్రాల్లో యూరియా వస్తుంది కానీ ఎప్పుడు అయిపోతుంది తెలియని పరిస్థితి. రైతుల పేర్లు నమోదు చేసుకోకుండానే ఇష్టానుసారంగా యూరియా ఎరువులు పంపిణీ చేస్తున్న రైతు భరోసా వ్యవసాయ అధికారులు. మండలానికి యూరియా ఎంత అవసరం అన్న సమాచారం వ్యవసాయ అధికారుల వద్ద లేకపోవడంతో అన్నదాతలు బయటి మార్కెట్లో 300 నుండి 320 రూపాయలు పెట్టి కొనాల్సిన దుస్థితి. బయటి షాపులలో పేరుకు మాత్రం 265 రూపాయలు బిల్లు ఇస్తున్నారు కానీ వసులు మాత్రం 300 రూపాయలు చేస్తున్నారు. ఇది మాత్రం వ్యవసాయ అధికారులకు కనిపించదు. బయటి షాపులలో ఇలా అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యవసాయ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం బండి ఆత్మకూరు మండలంలో యూరియ చాలా అవసరం ఉన్నది. ఈ సమాచారం వ్యవసాయ అధికారులకు తెలిసిన అప్పుడప్పుడు మాత్రం రైతు భరోసాలకు తెప్పిస్తున్నారు తప్ప బయటి షాపులకి ఎక్కువగా మద్దతు పలుకుతున్నట్లు రైతులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయ అధికారులు విచారణ చేసి బయటి షాపులలో అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. బయటి షాపులలో ధరల పట్టిక ఉండదు. ప్రభుత్వ నిబంధనలు పాటించరు. అయినా బండి ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారులు మాత్రం పట్టించుకోరు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ఆత్మకూరు మండలానికి యూరియా అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.